


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *నేటి యువత ..... నిన్నటి తల్లితండ్రులు*

**సమస్య** అనేది లేనివాళ్ళు ప్రపంచంలో లేరు. ఒకరికి తీరని కోరిక ఇంకొకరికి సమస్య. ఇంకొకరికి తప్పని సరి సంగతి, మరొకరికి కల. ఇవన్నీ లోతుకెళ్ళి విచారిస్తే ఆశ్చర్యం. ఎలా అంటే చెప్తా వినండి.

ఏక్తాకి నలభయ్యవ పుట్టినరోజు అయింది. పెళ్ళి అయిన ఏడాదిలోనే మొగుడు ‘అమ్మా అన్నం పెట్టు‘ అన్నాడని అత్తమామలని వెళ్ళగొట్టింది. వాళ్ళు వెళ్ళిపోయాక "ఏక్తా అన్నం పెట్టు" అన్నాడు ఆ మానవుడు.

"నీకు అన్నం పెట్టడానికి నీ కుక్ నా? నీ పనిమనిషినా?" అని వాడిని వెళ్ళగొట్టింది.

అతనెళ్ళి ఇంక సంయుక్తకి తాళి కట్టి అక్కడ వండుకు తింటున్నాడు. ఏక్తా ఒంటరిగా పన్నెండేళ్ళు గడిపింది. అన్నం వండుకోడం వ్యక్తి స్వేచ్ఛకి భంగం అని తలచి, కర్రీ పాయింట్స్‌నీ, మొబైల్ కుక్స్‌నీ సాయం కోరింది. ఉప్పూ కారం లేని వంటలతో ఒకటే ప్లేట్ వున్న డైనింగ్ టేబుల్‌తో డిప్రెషన్ పెరిగింది. ఫ్రస్టేషన్‌తో పిల్లల గురించీ, మొగుడి గురించీ చెప్పే కొలీగ్‌ని చెంప పగలకొట్టింది. ఆ అమ్మాయి ఏక్తామీద కంప్లైంట్ చేసింది. మేనేజ్‌మెంట్ ‘నీకు విశ్రాంతి అవసరం మెంటల్ ట్రీట్‌మెంట్ కూడా‘ అని ఇంటికి పంపారు.

రకరకాల హాస్పిటల్స్, సైక్రియాట్రిస్ట్స్, కౌన్సిలింగ్స్‌వాళ్ళు ఆమె బ్యాంక్ బాలన్స్ పూర్తిగా ఖాళీచేసాక, ఏక్తాకి తన ఒంటరితనమే తన ఫ్రస్టేషన్‌కి కారణం అని తెలిసింది. గోడల మీద ఎవరూ తన చావుకి బాధ్యులు కారని రాసి ఆత్మహత్య చేసుకుంది.

ఈ విషయం తెలిసి సుబ్బలక్ష్మి బోలెడు ఆశ్చర్యపోయింది. ‘ఒంటరిగా వుంటే ఏం? దానికే చచ్చిపోతారా? నేను ఒంటరిగా వుండాలని ఎంత కోరుకుంటానో, బాత్‌రూంలో కూడా ఆ కోరిక తీరలేదు‘ అంది.

సుబ్బలక్ష్మి ఏడుగురి పిల్లల్లో మధ్యలో పుట్టింది నలుగురు తర్వాత. ఓ చిన్న గదిలో, ఒకరి మీద ఒకరు పడుకున్నట్లు పడుకోడం, బాత్‌రూమ్‌కి టైం కలిసొస్తుందని ఏ చెల్లిలితోనో, అక్కతోనో కలిసి స్నానం చెయ్యడం... ఇలా బాల్యం గడిచింది. తరువాత పెళ్ళి అయింది. ఆమె భాగ్యానికి ఓ చావిడీ ఇంట్లో ఎనిమిది వాటాలుంటే, మధ్యలో రైలు పెట్టిల్లా వున్న మూడు గదుల ఇంట్లో, మొదటిగదిలో అత్తమామలూ, మధ్యలో గదిలో తనూ, భర్తా, చివరి గది వంట గదిగా సంసారం ప్రారంభం అయింది. ఒళ్ళు బావుండలేదనో, పురుళ్ళూ పుణ్యాలూ అనో వచ్చే ఆడబిడ్డలతో, ఆమె, ఆమె భర్తా వంటగదికి తమ పక్క మార్చుకున్నారు. వీళ్ళకి పిల్లలు పుట్టారు. సుబ్బలక్ష్మి కనీసం ఆలోచనలు కూడా ఒంటరిగా చెయ్యలేకపోయింది తన మనసులో. ఆమెకి తీరని కల ఒంటరిగా ఒక్కతే కూర్చుని పుస్తకం చదువుకోడం,

కరువుతీరా నిద్రపోవడం, ఇష్టమైనవి వండుకు తింటూ టీ.వీ చూడడం. ఇవేమీ తీరకుండానే ఈ వంటగదిలో అందరికీ కాఫీలు కలుపుతూ చీకట్లో పోతానేమో అని ఆమె బెంగ. ఆమెకి ఏక్తా ఒంటరితనంతో పోయిందంటే బోలెడు ఆశ్చర్యం వేసి, నాతో పంచుకుంది.

ఇంకో అమ్మాయి భావన నా దగ్గరకొచ్చింది కౌన్సిలింగ్‌కి.

"ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు అతివేష్, కానీ నా భావాలని అతను కానీ అతని పేరెంట్స్ కానీ పట్టించుకోరు. నాకంటూ స్పేస్ ఇవ్వడం లేదు" అంది.

"పెళ్ళయి ఎంతకాలం అయింది?" అడిగాను.

"అరవైరోజులయింది. ఇంకా వాళ్ళకి నేనేమిటో అర్థంకాలేదు" బాధగా నిట్టూర్చింది.

"పెళ్ళవగానే హనీమూన్‌కి వెళ్ళలేదా?"

"వెళ్ళాం 20 రోజులు యూరప్ టూర్"

"అయితే ఇంక మిగిలింది నలభైరోజులేగా?" అడిగాను. నాకప్పుడప్పుడూ నా లెక్కల మీద నాకే గర్వంగా వుంటుంది. అనవసరంగా కొట్టేది చిన్నప్పుడు విక్టోరియా టీచర్ లెఖ్ఖలు రావట్లేదని.

"నలభై ఎందుకు మామ్? నాలుగు రోజులు చాలు. వాళ్ళు ఎలాంటివాళ్ళో చెప్పడానికి" అంది భావన.

"ఏం చేసారూ?" అడిగాను.

"పెళ్ళయిన వారంలోనే మా మావగారు 'అమ్మా స్నానం చేసావా? ప్రసాదం తీసుకో' అన్నారు."

"అయితే?"

"వాట్? మావగారు నన్ను స్నానం చేసావా? అంటాడా? హౌ పర్సనల్ దట్ ఈజ్? నా భర్తకూడా నా శరీరానికి సంబంధించిన విషయం అలా అడగకూడదు. మీకు తప్పనిపించలేదా? రబ్బిష్" అంది నిరసనగా.

నేను ఎంత వెనుకబడి వున్నానో నాకప్పుడు అర్థం అయింది. అదేవిటో ఇలాంటిమాటలు మేమూ మాట్లాడుకుంటాం "స్నానాలు అయిపోతే అందరం భోంచేసేద్దాం" లాంటివి. డైరీలో రాసుకున్నాను.

"స్నానం పర్సనల్. ఎప్పుడూ కోడళ్ళతో ఆ మాట వాడకూడదు" అని మనమూ ఎడ్యుకేట్ అవ్వాలిగా.

"ఇంకా ఏం చేసారు?" అడిగాను.

"వాళ్ళు నన్ను అడుగుతున్నారు 'అతివేష్ మరీ లేట్‌గా నిద్రలేస్తున్నాడు. ఏం తినకుండా వెళ్ళిపోతున్నాడు ఆఫీస్‌కి. త్వరగా లేవమను' అని. నేనేం వాళ్ళ అబ్బాయికి 'ఆయా'నా? బేబీ సిట్టింగ్ చేసే 'కేర్ టేకర్'నా?" ఆవేశంగా అడిగింది.

"అప్పుడు నువ్వేం అన్నావ్?" అడిగాను.

"ఇదే ప్రశ్న అడిగాను. నేను ఇవాళ వచ్చాను. మీరు ముప్పై ఏళ్ళుగా అతన్ని చూసుకుంటున్నారుగా?" అని అంది.

"అప్పుడు వాళ్ళేం చేసారూ?"

"నెక్స్టడే మా అత్తగారు మేనర్స్ లేకుండా తలుపు మీద కొట్టి, 'అతివేష్ ఆఫీస్‌క్ టైం అవుతోందిలే' అంది. ఎంత బ్రూట్స్?" కోపంగా అంది భావన.

నేను నోట్ చేసుకున్నాను "పెళ్ళయ్యాక వాళ్ళెప్పుడు లేచినా, ఆఫీస్‌కి వెళ్ళినా, వెళ్ళకపోయినా మనం పట్టించుకోకూడదు" అని.

"ఇంకా ఏం ప్రాబ్లమ్స్ వున్నాయమ్మా?" ఆమె మనోభావాలని అర్థం చేసుకోడానికే ప్రయత్నిస్తూ అడిగాను.

"మా అత్తమామలకి మానవత్వం లేదు. అసలు జాలీ, దయా, సానుభూతీ లేదు" బాధగా అంది.

"అయ్యో! ఏం చేసారు?" అన్నాను.

"రోడ్డు మీద ఒక కుక్క కాలు లేక ఈడుస్తూ వెళ్తోంది. మిగతా కుక్కలు కరుస్తుంటే నేను దాన్ని ఇంటికి తీసుకొచ్చాను. స్ట్రేడాగ్స్‌ని ప్రేమగా చూడాలని 'అమలా అక్కినేనీ, 'ఉపాస్నా కొణిదెల' చెప్పారుగా? (భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు.) మా అత్తగారు నాకు ఆస్తమా వద్దు అంటుంది. మావగారిని పాపం అది భయపడి చిన్నగా చిటికెన వేలు కొరికింది. దానికే ఆయన చాలా గోల చేసాడు. నాకు షుగర్ వుంది, ఇది చిటికిన వేలు కొరికేసింది సెప్టిక్ అవుతుందేమో అని. దాన్ని వదిలెయ్యమంటారు. 'డే'కేర్ లో పెడ్తాను. నెలకి ఇరవైవేలు అవుతాయి. మీరిస్తారా? అన్నాను. వాళ్ళకి సెన్సిటివిటీ లేదు. ఓ కుక్కకి ఆశ్రయం ఇవ్వలేరా?" అంది.

"ఎంత ఇల్లు మీది?" అడిగాను.

"టూ బెడ్ రూమ్స్ హౌస్" అంది.

"అర్ధమైంది. ఒకటి మీకూ, ఒకటి కుక్కకీ, బట్ అమలా అక్కినేనికీ, ఉపాస్నా కొణిదెలకీ ఇల్లు పెద్దది. పైగా వాళ్ళు వీటికే పెద్ద గ్రౌండ్ కొని కెన్నెల్స్ కట్టారుట. వాళ్ళతోబాటు ఈ డాగ్స్ సేమ్ కిచెన్, సేమ్ బెడ్‌రూమ్స్ షేర్ చేసుకోనక్కర్లేదు అనుకుంట" అన్నాను లాజికల్‌గా. నా లాజిక్‌కి కుడా నేను అప్పుడప్పుడూ మురిసిపోతుంటాను.

ఆ అమ్మాయి కోపంగా "పెద్ద మనసుండాలి, పెద్ద ఇల్లు కాదు" అంది.

"మరి ఆ కుక్కని నువ్వు ఇంట్లో వుండి చూసుకుంటావా? వాటిని ఒకటికీ, రెంటికీ తీసుకెళ్ళాలిగా?" అడిగాను.

"రిటైరయి ఇంట్లో కూర్చున్న మావగారు ఆ మాత్రం పని చెయ్యలేరా? మా అత్తగారికి 'గుడ్డు ముట్టుకోవడం ఇష్టంలేదుట. మరి దానికి గుడ్డూ ఫుడ్డూ వండి పెట్టాలిగా.' నేను ఉద్యోగం మానెయ్యలేనుగా దానికోసం" అంది.

"వాళ్ళు ఒప్పుకున్నారా?" అడిగాను.

"లేదు. కుక్క వుంటే ఈ ఇంట్లో వుండలేము అంటున్నారు. వేరే వెళ్ళిపోతారుట" అంది.

"మరీ మంచిదిగా?"

"అరె.. నేను పొద్దుట లేచి పనిమనిషొస్తే పని చేయించి, పాలవాడొస్తే పాలప్యాకెట్ తీసుకుని, కుక్‌ని పెట్టుకుని ఆమెకి అన్నీ పురమాయించి, ఇవన్నీ చేసుకుని ఆఫీస్‌కి వెళ్ళాలా?" అరిచింది.

"అయితే వాళ్ళు నీకు కావాలి" అన్నాను.

"యూనో.. ఆ కుక్కని బయటకి తీసుకెళ్ళడానికి పనివాడిని పెట్టుకుందాం అంటే నెలకి తొమ్మిదివేలు అడిగాడు. కుక్ పధ్నాలుగు వేలు అడిగింది. ఎంత కష్టం? పోనీ ఈ ఇన్‌లాస్ ఏమైనా ఆస్తులిచ్చారా మాకు?" అంది.

"అన్ని విధాలుగా పనికిరాని అత్తమామలని ఎలా భరిస్తారమ్మా మీ తరం?" అని నేనూ ఆమె విచారం పంచుకున్నాను.

అసలు ఈ అత్తామామలు పిల్లల పెళ్ళిళ్ళు అయ్యాక కూడా ఇంకా బతకడం ఏవిటీ? అని ఆలోచిద్దాం అన్నా ఈ మధ్య 'హమ్ ఆప్ కే హై కౌన్' అత్తామామలే అప్పట్లో యంగ్ అనుకుంటే, ఇప్పుడు చుడీదార్‌లలో 'ఇంద్రజ'లూ, 'సంఘవి'లూ లాంటి అత్తామామలు వస్తున్నారు. 'ఎప్పటికి ముసలివాళ్ళయి పోతారు' చెప్పండి. వాళ్ళు కూడా ఓ ఫ్లాటో, ప్లాటో కొని వాళ్ళ శక్తి కొద్దీ ఈ పిల్లలకి ఇచ్చి పోతారు. కానీ వున్నప్పుడు మాత్రం ఈ దిక్కుమాలిన అత్తమామలతో సమస్యే. అన్నం తిన్నారా? ఎప్పుడు నిద్రలేస్తారూ? ఇంత రాత్రి అయినా ఇంటికి రాలేదేవిటి? జాగ్రత్తగా వెళ్ళండమ్మా, ఒంట్లో బాలేదా పడుకున్నావూ? ఇంటికి చుట్టాలొచ్చారు, కోడల్ని చూడాలంటున్నారు. హలో అనమ్మా కనీసం" (ఇంటికొచ్చిన వాళ్ళకి మంచినీళ్ళు ఇచ్చే కోడళ్ళ యుగం ఎటూ పోయిందనుకోండీ. ఆశించకూడదు) అంటూ తెగ సాధించి రాచిరంపాన పెట్టేస్తుంటారు ఈ అత్తమామలు. హౌ ఓల్డ్ ఫ్యాషన్డ్. అన్నీ 'ఎమెజాన్'లో కొని ఓల్డ్ స్టఫ్ 'ఓలెక్స్'లో అమ్మేసి, 'స్విగ్గీ, జొమేటాన్'లో ఫుడ్ తెప్పించుకుని, 'క్వికర్'లో సర్వీస్ బుక్ చేసి వేస్ట్ అయిన మెటీరియల్స్ డిస్పోజ్


ఆఫ్ చేసే యుగంలో ఇంట్లో 'ఈ ఓల్డ్ స్టఫ్' దట్ టూ ఇంట్లో చోటు లేదు కుక్కల్నీ, పిల్లుల్నీ పెంచుకోవద్దు అనే హ్యూమానిటీ లేని 'అసాంఘీక శక్తుల్ని ఈనాటి యువతి ఎలా భరిస్తుంది చెప్పండీ?

ఇక 'అతివేష్'గాళ్ళ విషయానికొస్తే, వాళ్ళకే పెళ్ళాంతో ఏం మాట్లాడాలో, ఎలా,మాట్లాడాలో, ఏం చేస్తే లైన్ క్రాస్ చేసినట్లో అర్థంకాక అయ్యోమయ్యం స్థితిలో వుంటున్నారు.

తల్లి పెళ్ళాన్ని "నీ పుస్తెల తాడు బాత్‌రూమ్‌లో వదిలేసావు. వేసుకో తల్లీ" అంటే వీడికి భయం తర్వాత జరిగే సంఘటన తెలుసు కాబట్టి. "అమ్మా శుక్రవారం బొట్టుపెట్టుకో" అంటుందేమో లేక ఏ పేరంటానికి పిలవడానికో వచ్చిన ముత్తైదువులు బొట్టు పెడ్తారో పెళ్ళానికి అని దడిచి చస్తుంటారు. అంతేకాక, తల్లీ తండ్రీ ఇంటికొస్తే 'టీ' పెట్టి ఇస్తుందేమో పెళ్ళాం అని ఎక్స్‌పెక్ట్ చేస్తారేమోనని అదాటుగానే వుంటుంది. తొడల్లోకి 'షాట్స్' వేసుకున్న పెళ్ళాం, కాలిమీద కాలు వేసుకుని కూర్చుంటే అమ్మా నాన్నలు అలవాటు పడ్డా, ఏ ముసలి అమ్మమ్మో, బామ్మో "అదేవిటమ్మా పైన ఏవీ వేసుకోలేదు. చెడ్డీమీద" అంటారేమోనని చచ్చే భయం. అంతేకాదు. తల్లీ తండ్రీ బెడ్‌రూమ్‌లోకి పర్మిషన్ లేకుండా వచ్చేస్తారేమోనని కూడా భయంతో అస్తమానం తలుపు వేసుకుని కూర్చోవలసి వస్తోంది పాపం.

ఇంక వంటరితనం మరణాలూ, పంచుకునే మనుషులు లేక పలకరించే దిక్కు లేక అవీ ఓ పక్క జోరుగా సాగుతున్నాయి. ఏదైనా నాకు బోలెడు ఎడ్యుకేషన్ భావన ద్వారా Do's and Don'ts of inlaws తెలిపాయి.

Post your comments




https://www.youtube.com/watch?v=ERaaX_IulS4

